క్లుప్తంగా

2 నుంచి రిజిస్ట్రేషన్లు

నంద్యాల(అర్బన్): ఏప్రిల్ 2 నుంచి నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ ద్వారా సులభతరమైన రిజిస్ట్రేషన్లు జరగనున్నాయని సబ్ రిజిస్ట్రార్-2 చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ కర్నూలు వారి ఉత్తర్వుల మేరకు దస్తావేజు స్వీకరణకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్‌ను నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. క్యూలైన్‌లో గంటల తరబడి వేచి చూడకుండా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లెకు చెందిన లక్ష్మీదేవి సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీదేవికి గ్రామానికి చెందిన ఓబులేసుతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఉమ్మడి కుటుంబంలో నివశిస్తున్న వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే ఇంటి పనుల విషయంలో ఆమెకు, తోడి కోడలికి మధ్య చిన్న వాగ్వివాదం నెలకొంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మూడు గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నెలో సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన చిన్న సుబ్బరాయుడు, రాములమ్మ, గంతులయ్య అనే ముగ్గురు రైతులకు చెందిన గడ్డి వాములు కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. దూమపానం చేసే వారి నిర్లక్ష్యం కారణంగా గడ్డివాములకు నిప్పంటుకున్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదంలో బాధిత రైతులకు నష్టం సంభవించడంతో పాటు పశువులకు గ్రాసం కొరత ఏర్పడిందన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఆవుల శ్రీధర్ నాయుడు

బేతంచెర్ల: డోన్‌కు చెందిన వ్యక్తి ఆర్టీసీ బస్సులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ రమేష్ బాబు వివరాల మేరకు.. డోన్ కొండపేటకు చెందిన ఆవుల శ్రీధర్‌నాయుడు (52) స్టేట్ బ్యాంక్‌లో మెసెంజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఆరేళ్ల కుమారుడితో కలిసి బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామంలోని సుంకులమ్మ దర్శనం కోసం బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బేతంచెర్లలోని డోన్ క్రాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. డోన్ చేరుకోగానే శ్రీధర్ నాయుడు అపస్మారక స్థితిలో ఉండడంతో కుమారుడు కండక్టర్ వద్దకు వెళ్లి తన తండ్రి లేవట్లేదని తెలిపాడు. కండక్టర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలి

● హిమోఫీలియా వ్యాధిగ్రస్తుడి విన్నపం



తండ్రి ధర్మరాజుతో హిమోఫిలియా వ్యాధిగ్రస్తుడు థామస్

జూపాడుబంగ్లా: హిమోఫీలియా వ్యాధిగ్రస్తుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫ్యాక్టర్-7 ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని హిమోఫిలియా వ్యాధిగ్రస్తుడు థామస్ వేడుకుంటున్నాడు. తండంచ గ్రామానికి చెందిన ధర్మరాజు కుమారుడు థామస్ పదో తరగతి చదువుతున్నాడు. భార్య కొంతకాలం క్రితం మృతిచెందంతో కూలీ పనులకు వెళ్తూ కుమారుడిని చదివించుకుంటున్నాడు. అయితే కుమారుడు థామస్‌కు పుట్టుకతోనే హిమోఫీలియా వ్యాధి ఉంది. ఈ వ్యాధి తీవ్రతను బట్టి ప్రతి నెలా ఫ్యాక్టర్-7, 8, 9 ఇంజెక్షన్లు వేసుకోవాల్సి ఉంది. ఇంజెక్షన్ వేయించుకోకపోతే కీళ్లవద్ద వాపులు వచ్చి అంతర్గతంగా రక్తం బ్లీడింగ్ అయి ఆరోగ్యం క్షీణించి అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటుంది. సోమవారం థామస్ 'సాక్షి'తో మాట్లాడుతూ ఇంజెక్షన్లు బయట కొనుగోలు చేయాలంటే ఒక్కొక్కటి రూ.4 వేల నుంచి రూ.6 వేలు ఉందన్నారు. ఫ్యాక్టర్-7 ఇంజెక్షన్లు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆస్పత్రుల్లో సరఫరా లేదంటున్నారన్నారు. తన తండ్రి కూలీ పనులకు వెళ్లి తనను పోషిస్తున్నాడని బయట ఇంజెక్షన్లు కొనుగోలు చేసే శక్తి తమకు లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో ఇంజెక్షన్లు, మందులు అందుబాటులో ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని కోరారు.



ఆళ్లగడ్డలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చాగలమర్రి దువా చేస్తున్న ఇమాం హఫీజ్ ముల్లా ముజీబుర్ రెహ్మాన్, ప్రభుత్వ ఖాజీ ముల్లా యూనస్ బాషా



ముస్లింలకు మజ్జిగ పాకెట్లను పంపిణీ చేస్తున్న నాగరాజు



ఉయ్యాలవాడలో దువా చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్





రుద్రవరం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, శిరివెళ్ల ఈద్గా వద్ద బోధనలు వింటున్న ముస్లింలు

ఉయ్యాలవాడ: నెల రోజుల కఠిన ఉపవాసం తరువాత జరుపుకునే ఈదుల్ ఫితర్ పండుగను మండలంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక నూరాణి, జామియా మసీదుల నుంచి ర్యాలీగా అల్లా నామస్మరణ చేస్తూ కుందూ నది ఒడ్డున ఉన్న ఈద్గా వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకున్నారు. మత గురువు పాల దస్తగిరి రంజాన్ పండుగ విశిష్టత, అల్లా బోధనలు, మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని వినిపించారు. అనంతరం సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

ప్రార్థనలకు భారీగా తరలివచ్చిన ముస్లింలు

చాగలమర్రి: మేజర్ గ్రామ పంచాయతీ చాగలమర్రితో పాటు పెద్దవంగలి, చిన్నవంగలి, ముత్యాలపాడు, మద్దూరు, శెట్టివీడు, మల్లెవేముల గ్రామాల్లో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చాగలమర్రి ఈద్గా వద్ద ప్రార్థనల్లో వేలాది మంది పాల్గొనడం విశేషం. మత గురువులు ఇమాం హఫీజ్ ముల్లా ముజీబుర్ రెహ్మాన్, ఖాజీ ముల్లా యూనస్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్, దూవా చేశారు. స్థానిక విజయ డైరీ పార్లర్ యజమాని నాగరాజు ఈద్గా వద్ద ముస్లింలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు ఆర్.నాగులవరం, నర్సాపురం, ఆలమూరు, కొండమాయపల్లె, ఎల్లావత్తుల తదితర గ్రామాల ముస్లింలు ఉదయాన్నే మసీదుల నుంచి గ్రామ శివారులో ఉన్న ఈద్గాకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక నమాజు చేశారు. ఆయా ఈద్గాల వద్ద మత పెద్ద పండుగ విశిష్టతను వివరిస్తూ అందరికీ మంచి జరగాలని అల్లాను ప్రార్థించారు.

దొర్నిపాడు: మండలంలో 30 రోజుల ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు సోమవారం ఉదయమే నూతన దస్తులు ధరించి ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇద్గాలో మత పెద్ద ఇమాం ముల్లా అబ్దుల్ హఫీజ్ రంజాన్ సందేశం వివరించారు.

శిరివెళ్ల: మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, కోటపాడు, బోయలకుంట్ల, మహదేవపురం, జీనేపల్లె, వనికినిదిన్నె మసీదు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజు చేశారు. హిందూ-ముస్లింలు పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వంశీధర్, ఎస్‌ఐ చిన్న పీరయ్య గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఆళ్లగడ్డ: నియోజవర్గంలో ఈద్ ఉల్ ఫితర్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆయా ప్రాంతాల్లోని మసీదుల వద్ద నుంచి మతగురువుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా అల్లాను స్మరిస్తూ ఈద్గాల వద్దకు చేరుకున్నారు. మత పెద్దలు, గురువులు చెప్పిన ఆధ్యాత్మిక విషయాలను శ్రద్ధగా ఆలకించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



దొర్నిపాడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు

నలుపు రిబ్బన్లతో ఈద్గాకు..

చాగలమర్రి: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ మండలంలోని ముస్లింలు సోమవారం చేతికి నలుపు రంగు రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్‌తో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేతికి నలుపు రంగు రిబ్బన్‌తో నమాజుకు హాజరయ్యారు. అనంతరం వక్ఫ్ సరవణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షేక్ బాబులాల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వక్ఫ్ భూములను కార్పొరేటు వారికి ధారాదత్తం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ బిల్లును వైఎస్సార్‌సీపీ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ముస్లింలందరూ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

అల్లా బోధనలు అనుసరణీయం

నంద్యాల(వ్యవసాయం)/అర్బన్: అల్లా బోధనలు అనుసరణీయమని ముస్లిం మత పెద్దలు సూచించారు. నియోజకవర్గంలో ముస్లింలు రంజాన్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మాసమంతా నమాజ్, జకాత్, రోజాలను త్రికరణ శుద్ధిగా ఆచరించిన ముస్లింలు ఉదయమే మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు. ఆలింగనం చేసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నంద్యాలలోని ఎస్సార్బీసీ రస్తాలో ఉన్న థయిబా ఈద్గా, భీమవరం రస్తాలోని ఆల్‌ఫుర్ఖానా ఈద్గా, సాయిబాబానగర్ ఖుబ్రా ఈద్గా, బొమ్మలసత్రం ఈద్గా, శాంతిరాం మెడికల్ కళాశాల వద్ద సున్నీ ఈద్గా, దేవనగర్ తదితర ఈద్గాలలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. రంజాన్ విశిష్టతను మౌలానాలు తెలియజేశారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసమన్నారు. అల్‌ఫుర్ఖానా ఈద్గాలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ డాక్టర్ నౌమాన్ ప్రార్థనలు నిర్వహించారు. పలు ఈద్గాల్లో రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆధ్వర్యంలో మసీదులు, ఈద్గాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు.

● నంద్యాల మండలంలోని పోలూరు, అయ్యలూరు, కానాల, చాబోలు, చాపిరేవుల, భీమవరం, మిట్నాల, పుసులూరు తదితర గ్రామాల్లో ఉన్న మసీదులు, దర్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగా గోస్పాడు మండల వ్యాప్తంగా రంజాన్‌ను ముస్లింలు ఘనంగా



అల్‌ఫుర్ఖాన ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు





సాయిబాబానగర్ ఈద్గాలో సందేశం ఇస్తున్న మౌలానా, భీమవరం రస్తాలోని అల్‌ఫుర్ఖాన ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న మౌలానా



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, డాక్టర్ నౌమాన్



చాపిరేవుల అజూతలాహా మసీద్‌లో సందేశమిస్తున్న ఇమామ్‌సాబ్

మహానందీశుడికి గ్రామోత్సవం



మాడవీధుల్లో విహరిస్తున్న మహానందీశుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన కన్నడ భక్తుల దర్శనార్థం ఆలయ మాడవీధుల్లో ఉత్సవం జరిపారు. ముందుగా ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవారి దంపతులను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో ఉత్సవం కనులపండువగా సాగింది. కర్ణాటక భక్తులు వేలాదిగా మహానంది ఆలయానికి తరలిరావడంతో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఉచిత దర్శనంతో పాటు రూ.50 టికెట్లు విక్రయించడంతో కన్నడిగుల ద్వారా రెండ్రోజుల్లో సుమారు రూ.18 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ప్రాథమిక సమాచారం.

కన్నడిగుల ఆకలి తీర్చిన అన్నదాతలు

మహానందీశ్వరస్వామి దర్శనార్థం వేలాది సంఖ్యలో వచ్చిన కన్నడ భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్ల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంతో పాటు నంద్యాలకు చెందిన బల్లాని చలమయ్య, ఆర్యవైశ్య అన్నసత్రం, వీరశైవ లింగాయతుల కమిటీతో పాటు వివిధ కుల సంఘాలకు చెందిన వారు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. క్యూలైన్లలోని భక్తులకు నంద్యాలకు చెందిన కల్లూరి రామలింగారెడ్డి మజ్జిగ అందించగా, రోటరీక్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సెక్రటరీ బాలకృష్ణ, వీరభద్ర సప్లయర్స్ అధినేత, మహానంది ఆలయ అర్చకులు వాటర్‌బాటిళ్లను పంపిణీ చేశారు.



మహానందిలో కన్నడిగులకు అన్నప్రసాదం అందిస్తున్న దాతలు

అన్నప్రసాద వితరణకు విరాళాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం నంద్యాలకు చెందిన బి.రంగారెడ్డి రూ.1,50,000 విరాళాన్ని ఏఈఓ జి.స్వాములుకు అందించారు. అలాగే కర్నూలుకు చెందిన కె.ఆర్.వరప్రసాద్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖరరెడ్డికి అందజేశారు. దాతలకు దేవస్థానం తరఫున స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదం అందించి సత్కరించారు.

పుణ్య క్షేత్రాలను సందర్శించిన ప్రముఖులు



సంగమేశ్వరంలో జడ్జి దంపతులకు స్వాగతం పలుకుతున్న పురోహితుడు

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం, కొలను భారతి క్షేత్రాలను కర్నూలు ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని రెడ్డి దంపతులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, టీటీడీ మాజీ ఈఓ ఐవీ కృష్ణారావు సోమవారం సందర్శించారు. ముందుగా సంగమేశ్వరం చేరిన వీరికి ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు. వారు వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం కొలనుభారతిదేవి ఆలయాన్ని చేరుకుని సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అక్కడే ఉన్న సప్తశివాలయాలను సందర్శించుకుని, ఛారుఘోషిని నదిని తిలకించారు.

అలరించిన భక్తిరంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై తెనాలికి చెందిన నేరెళ్ల వరలక్ష్మి కల్యాణి, బృందం వారి భక్తి రంజని కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా ఉగాది వేడుకలు

రుద్రవరం: మండలంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని 21 గ్రామ పంచాయతీల ప్రజ లు గ్రామ దేవతలైన సుంకులమ్మ, ఎల్లమ్మ, మారె మ్మ ఆలయాలకు వెళ్లి కాయా కర్పూరంతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరంగాపురంలో పోలేరమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పలు రకాల పోటీలు నిర్వహించారు. మొదటి రోజు ఆరు పండ్లలోపు ఎద్దుల విభాగం బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి 10 కాండ్ల వృషభ రాజములు పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల ప్రకారం అందించేలా గ్రామ పెద్దలు నిర్ణయించారు. అలాగే మంగళవారం న్యూ కేటగిరీ ఎద్దుల విభాగానికి బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల ప్రకారం నగదు బహుమతులు అందజేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.



శ్రీరంగాపురంలో బండను లాగుతున్న వృషభాలు

2న కలెక్టరేట్ ఎదుట నిరసన

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 2న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ కేవీ శివయ్య, జనరల్ సెక్రటరీ అబ్దుల్‌కలాం తెలిపారు. సోమవారం ఫ్యాప్టో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మూడు డీఏలను మంజూరు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2004లో కంటే ఉపాధ్యాయ వృత్తిలో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్రం అమలు పరిచిన జీవో నం. 57ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇంగ్లీష్ మాధ్యమంతో పాటు తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో కొనసాగించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు సంబంధించిన 72, 73, 74 జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు తరలిరావాలని వారు కోరారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు గోపాలకృష్ణ, నగిరి శ్రీనివాసులు, అరవిందకుమార్, లక్ష్మణ్‌నాయక్, రామచంద్రారెడ్డి, జాకీర్‌హుసేన్, పుల్లయ్య, సాంబశివుడు, వెంకటేశ్వర్లు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఫ్యాప్టో సంఘం నాయకులు

కనులపండువగా రథోత్సవం



డబ్ల్యూ.గోవిందిన్నె నుంచి డబ్ల్యూ.కొత్తపల్లెకు బయలుదేరిన రథం



పెద్దమ్మ దర్శనం అనంతరం కమిటీ సభ్యులతో విజయవాడ డీఎస్పీ శ్రీనివాసులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో రథోత్సవం సోమవారం కనులపండువగా సాగింది. ఉగాది మరుసటి రోజు పెద్దమ్మకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం రథాన్ని కాడెద్దులకు కట్టి డబ్ల్యూ.కొత్తపల్లెకు మేళతాళాలతో వెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉన్న గ్రామస్తులు రథానికి ఘనస్వాగతం పలికారు. ఉగాది సందర్భంగా ఈ సాంప్రదాయాన్ని రెండు గ్రామాల ప్రజలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. విజయవాడ డీఎస్పీ శ్రీనివాసులు పెద్దమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రుల మహోత్సవాలు



కోటావీధిలోని ప్రత్యేక అలంకారంలో ఏకశిల సీతారామ లక్ష్మణులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రామాలయాలలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని వసంత నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. సంజీవనగర్ రామాలయం, బైటిపేట కోదండ రామాలయం, ఎస్‌బీఐ కాలనీ రామాలయం నూనెపల్లెలోని సీతారామాంజనేయ, కోటా వీధిలోని ఏకశిల సీతారామస్వామి ఆలయం, మూల సాగరంలోని కోదండ రామాలయాల్లో మొదటిరోజు వసంత నవరాత్రి ఉత్సవాలు, రామాయణ పఠనం రెండో రోజు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, పూలంగి సేవ, అర్చనలు, సింధూర అర్చనలు నిర్వహించి మహామంగళ హారతులు నిర్వహించారు. సాయంత్రం సంజీవనగర్ రామాలయంలో స్వామి అమ్మవార్లకు వేద పండితులు పవన్ శర్మ, కార్తికేయ శర్మల ఆధ్వర్యంలో ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.